features@suryaa.com

Life is a Rainbow

కలర్స్

ఆదివారం 19 జూన్ 2011

సూర్య

# పితృ దేవో భవ:

## నేడు ఫాదర్స్ డే



భార్య గర్భం దాల్చిన దగ్గర్నించి ఆమెతో పాటు సమానంగా ఆమెను, ఆమె కడుపున వున్న బిడ్డను కూడా ఎంతో జాగ్రత్తగా చూసుకునే తండ్రుల సంఖ్య పెరిగింది. ప్రసవం సమయంలో, ప్రసవానంతర సమయంలో స్త్రీకి ధీటుగా స్త్రీకన్నా ఎక్కువగా కూడా పుట్టిన బిడ్డని ఎంతో జాగ్రత్తతో కూడిన మమకారంతో చూస్తున్న తండ్రుల సంఖ్య గణనీయంగా పెరిగింది అనటంలో అతిశయోక్తి లేదనే చెప్పాలి. అసలు కొన్ని చోట్ల విదేశాల్లో పురుషునికి కూడా మెటర్నటీ లీవ్ ఇస్తారని వినికిడి. మన దేశంలో కూడా ఇలా భార్యను, పిల్లల్ని బాధ్యతగా ప్రెగ్నెన్సీ నిర్ధారణ జరిగిన రోజు నుంచి అత్యంత ఆదరంగా, అభిమానంగా, చూసే భర్తలు ఎందరో? అంటే అలాంటి తండ్రులకి.. నేడు ఫాదర్స్ డే గ్రీటింగ్స్ చెప్పాల్సిన బాధ్యత మనకి లేదా?? తల్లి స్థానం 'నిజం' అని తండ్రి స్థానం 'నమ్మకం' అనే మాటను వినే వుంటారు చాలామంది. తండ్రి ఎవరో తల్లి చెప్తే తప్ప తెలీదు అనే స్త్రీవాదులున్నప్పటికీ సైంటిఫిక్‌గా అది నిజం కానే కాదుట. పసి పిల్లలు తమ తండ్రిని గుర్తిస్తారుట. కళ్లు తెరచినప్పటి నుంచీ తమ తల్లితో పాటుగా తండ్రి కోసం కూడా వెతుకుతారుట. అంటే తమ తండ్రి స్పర్శను వారు చక్కగా గుర్తించగలరు. తల్లి, తండ్రులు, బిడ్డల మధ్య పెనవేసుకున్నది 'జెనిటిక్ బాండ్'. అది తరతరాలకి పాకే అపూర్వ నిధి.

### మార్గదర్శకుడిగా తండ్రి...

'ధైర్యం నాన్న ఇచ్చేది...భద్రత నాన్న ఇచ్చేది...క్రమశిక్షణ నాన్న నేర్పేది...అవసరాలు నాన్న తీర్చేవి... పిల్లలకు తండ్రి రోల్ మోడల్...'బిడ్డల అభివృద్ధే నాన్న లక్ష్యం...తండ్రి ప్రభావం కన్పించేది కాదు... అనుభవించేది...వందమంది ఉపాధ్యాయుల పెట్టు ఒక తండ్రి...తండ్రి కోపం వెనుక బాధ్యత వుంది...'ఎలా బ్రతకాలో నేర్పించడు తండ్రి.. కాని బ్రతకటం ఎలాగో తన పిల్లలకి తెలిసేట్లుగా నేర్పించగలడు...మంచి తండ్రి వున్న బిడ్డలు ధన్యులు..'.ఇలా ఎన్నో చెప్పగలము తండ్రి గురించి. అసలు తండ్రి చూపే అభిమానం, బాధ్యతలు ఎవరికీ స్పష్టంగా కంటికి కనపడవు. కానీ ప్రభావం చాలా వుంటుంది. ఒకప్పటి తండ్రులు తమ హాబీలకు, ఇతర సుఖాలకు ప్రాధాన్యత ఇచ్చాకే కుటుంబం, భార్య, పిల్లలు అన్నట్లుగా వ్యవహరించినా... నేటి తరంలో తండ్రులు చాలా జాగ్రత్తగా ప్రణాళికాబద్ధంగా పిల్లల చదువులు, కెరీర్ విషయాల్లో ఆలోచిస్తున్నారు.

### ఈ తరం తండ్రులు...

- పెత్తనానికి ప్రాధాన్యత ఇవ్వటం లేదు.
- ఇంటి పనుల్లో సంపూర్ణంగా చేదోడు, వాదోడుగా వుంటున్నారు.
- పిల్లలకి అనుగుణంగా స్నేహితుల్లా వ్యవహరిస్తున్నారు.
- పిల్లల భావోద్వేగాలు చక్కగా అర్థం చేసుకుంటున్నారు.
- అదనపు బాధ్యతలు మోయటంలో ఉత్సాహంగా వున్నారు.
- హాబీలు, అవసరాలు కూడా విస్మరిస్తున్నారు.
- బిడ్డలపట్ల అపరిమితమైన వాత్సల్యాన్ని చూపిస్తున్నారు.
- స్త్రీ ఉద్యోగ, ఆరోగ్య రీత్యా ఇబ్బంది పడినా తను మాత్రం సంతోషంగా అన్నీ బాధ్యతలు మోయటం గమనార్హం.
- పురుషాహంకారం అనే మాటకి అవకాశం లేకుండా పిల్లల స్నానం, భోజనం, తినిపించటం అన్నీ తానే చూస్తున్నారు.
- పిల్లల్ని ఎత్తుకు తిప్పటం, లాలించడం, ఆడించటం అనే పనులకి అత్యధిక సమయాన్ని కేటాయిస్తున్నారు. తమ పనులు, అవసరాలు కూడా మరచిపోయి.



ఒక్కపుడు "అమ్మ కూచి" "బామ్మ కూచి"... అన్న మాటలు నేడు చాలా వరకూ (ఈనాటి తండ్రుల హయాంలో) వినబడటం లేదు. "నాన్న కూచి" అన్నదే తరచుగా మనకి వినబడుతున్నది. అది అమ్మాయి అయినా అబ్బాయి అయినా వాళ్ళు "నాన్న కూచులే"! అయిపోతున్నారు. సహనం, ప్రేమ, అనురాగం, అభిమానం, బాధ్యత.. ఆలనా, పాలనా... అన్నిటా తల్లులను మించిపోతున్నారు నేటి తండ్రులు. పిల్లలు పసి మొగ్గలు కదా! వారికి ఎవరో నేర్పక్కరలేదు. 'అమ్మని.. నాన్నని అభిమానించమని కాని నేటి సిసింద్రీలు 'నాన్న కావాలి, నాన్నతో వెడతాం అనటం చాలా విడ్డూరమా? కాదు, అలా పిల్లల్ని పెంచటంలో తండ్రులు తీసుకునే పాత్ర అలా వుంది.'తండ్రి ఎటువంటి వాడైనా తన కన్న బిడ్డల క్షేమాన్ని అభివృద్ధిని కోరుకుంటాడు అనటంలో అనుమానమే లేదు. ఎవరి మెప్పుకోసమో తన కుటుంబం కోసం తండ్రులు పాటుపడరు. అయినా సంఘంలో తల్లి పాత్రకి వచ్చినంత గుర్తింపు తండ్రి పాత్రకి రావటం లేదు. పిల్లల ఆర్థిక అవసరాలు తీర్చటం, పిల్లల విద్యాబుద్ధులు నేర్పటం, భార్య పిల్లలు అవసరాలు గుర్తించటం, ఇంటి యజమానిగా తగిన సరియైన నిర్ణయాలు తీసుకోవటం.. ఇవి తండ్రి బాధ్యతలుగా సంఘం నిర్దేశించింది.

అవసరాల రీత్యా చిన్నతనంలో అందునా బాల్యంలో తల్లికి అతి దగ్గరైన పిల్లలు సైతం వయసు వచ్చే కొద్దీ తమ తండ్రి విలువను తెలుసుకొని, ఆయన మనసుని అర్థం చేసుకొని – ఆయన్నీ గౌరవిస్తారు. అసలు పిల్లలకి తొలి 'హీరో తమ తండ్రే"! పిల్లలు పసితనం నుంచి ఊహ తెలిసే లోపల ఏ టివి యాడ్ చూసినా అందులో పురుషపాత్ర కనపడగానే నాన్న... డాడీ అని పిలవటం నేర్చుకోటం చూస్తుంటాం!

> పిల్లల్ని కనిపెంచటం...వారికి విద్యాబుద్ధులు నేర్పించటం... వారి బంగారు భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దటంలో తల్లిదండ్రుల పాత్ర సమానంగావున్నా తల్లికి లభించే గుర్తింపే ఎక్కువ. అంటే తల్లి ప్రేమ సెంటిమెంట్‌గా వ్రాసే కథలు, కవితలు, తీసే సినిమాలు... వీటన్నింటిని చూస్తే తండ్రి పాత్రకు అంతగా ప్రాధాన్యత లభించడం లేదని చెప్పుకోవచ్చు. బిడ్డ కోసం అమ్మ చేసే త్యాగం, ఎంత ముఖ్యమైనదో... నాన్న పడే తాపత్రయం, శ్రమ అంతే ముఖ్యమైనవి. కానీ తండ్రి శ్రమ, అభిమానం, తాపత్రయం.. అన్నీ పరోక్షమైనవి. నవమాసాలు మోసి పిల్లల్ని కనటం వలన స్త్రీ (తల్లి)దే పైచేయి. పైగా పిల్లల అవసరాలరీత్యా బాల్యం అంతా అమ్మ చుట్టూ తిరుగుతుంది. అందుకే అమ్మతో ఆ బంధం అంత సులభంగా, సహజంగా ఏర్పడుతుందనటంలో అతిశయోక్తి లేదు. కానీ తండ్రి పిల్లలకు అవసమైన సదుపాయాలను సమకూరుస్తూ వారికి ఏ లోటు రాకుండా చూస్తాడు. పిల్లల దగ్గర ఎప్పుడూ తల్లి ఉండేటట్టు చూసి వారిని కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. ఈ నేపథ్యంలో తల్లితో పాటు తండ్రికి కూడా సమాన గౌరవం ఇవ్వాలన్ని ఉద్దేశ్యంతో ప్రతి ఏటా జూన్ 19వ తేదీన 'ఫాదర్స్ డే'ను జరుపుకుంటున్నారు.

### సమాజంలో...

మన సమాజంలో తండ్రుల మీద ఒక రకమైన భావం వుంది. భర్తను పోగొట్టుకున్న స్త్రీ మరో వివాహం చేసు కోదు. పిల్లల కోసం బ్రతుకుతుంది. కానీ భార్య మరణించిన వ్యక్తి మరో వివాహానికి సిద్ధపడతాడు అంటా రు. తల్లులలాగా తండ్రులు పిల్లల కోసం త్యాగం చేయరని ఒక బలమైన అభిప్రాయం. ఇది సామాజి కంగా వున్న అభిప్రాయమే తప్ప, పిల్లల్ని నిర్లక్ష్యంతో తండ్రి వివాహం చేసుకోవటం కానేకాదు. పిల్లల బాగోగులు చూసేందుకే అతను మరొక పెళ్ళి చేసుకొనే ఆలోచన అన్నది అంతరార్థం!

### ఎప్పటి నుంచి జరుపుకుంటున్నారు...

బాధ్యత గల పౌరులుగా పిల్లల్ని తీర్చిదిద్దే తండ్రి పాత్ర ప్రాముఖ్యతను గుర్తించి ప్రశంసిస్తూ చేసే అందమైన రోజు 'ఫాదర్స్ డే'. ప్రపంచ వ్యాప్తంగా తండ్రి పాత్ర కీలకమైనా గత శతాబ్ది వరకు పిల్లల జీవి తంలో తండ్రి పాత్రకు సంబంధించిన అధికారిక గుర్తింపు లేదు. అసలు ఫాదర్స్‌డే ఉత్స వాలను జరపాలని ఆ అవసరా న్ని గుర్తించిన మహిళ లవింగ్ డాటర్ సొనారా. ఆమె వాషింగ్‌టన్‌లోని స్పొకన్‌కు చెందింది. ఆధునిక ఫాద ర్స్‌డే ఉత్సవాలకు మూలం. 'అమెరికా సంయుక్త రాష్ట్రాలు' అయినా అన్ని ప్రపంచ దేశాలకు పాకింది తండ్రులందరి గౌరవా ర్థం ఈ పండుగ! 1909లో మదర్స్‌డే అనే మాట స్మార్ట్ కుటుంబంలో తండ్రి పోషించిన పాత్ర 'ఫాదర్స్' డేకి పునాది అయ్యింది. అసలు దాని వెను క కథ! హెన్రీ జాక్సన్ స్మార్ట్, విలియమ్ స్మార్ట్ దంపతులు స్పోకనే గ్రామంలో వుండేవారు. వారికి ఆరుగురు సంతానం. వారిలో చివరి సంతానం 'సొనారా', ఆమె ఆరు నెలల వయసులో తల్లి మరణించింది. అందరికన్నా పెద్దపిల్ల 12 సంవత్సరాలు. ఇది 1885 నాటి స్థితి ఇది. అయితే అపుడు అతను (తండ్రి) మరల వివాహం చేసుకోవచ్చు. ఆ అవకాశం, హక్కు సమాజంలో వున్నాయి. కానీ తను వివాహం చేసుకొని సంసార సుఖం కన్నా కూడా తండ్రిగా తన పాత్రను నిర్వహించేందుకు చాలా ఇష్టపడ్డాడు. వ్యవసాయం చేస్తూనే ఆరుగురు బిడ్డలకీ తల్లి లేని లోటు తెలీకుండా పెంచాడు. ఆఖరిదైన సొనారాకి ఆయనే తల్లి తండ్రి అయ్యి పాలు పట్టటం, స్నానం, ఆహారం, జోల పాడి నిద్రపుచ్చటం, అన్నీ చేసి తల్లి పాత్రను అద్భుతంగా పోషించాడు. అసలు ఆయన పెంపకంలో ఆమెకి తల్లి అనేది వుంటుందని... తల్లి పాత్ర ఒలా వుంటుందని కానీ తెలీలేదు. ఆమెకి తెల్సింది తనని కంటికి రెప్పలా కాపాడిన తండ్రి.. ఊహ తెల్సింది మొదలు కళ్ళ ముందు తండ్రి. దైవంలా తనను కాపాడిన ఆ తండ్రి రుణాన్ని తీర్చుకోవటం కోసం బాగా ఆలోచించింది.. అందులోంచి వచ్చినదే వేడుకగా "అతని పుట్టిన రోజు ఘనంగా నిర్వహించటం".

తన తండ్రి మిగిలిన తండ్రిలా కాదు. ఆషామాషీగా నిర్వహించకూడదు. తమ కోసం ఎంతో త్యాగం చేసిన మానవతా మూర్తి. అందుకే ఆయన జన్మదినాన్ని తండ్రులందరి జన్మదినంగా జరపాలని ఆమె అనుకుంది. కానీ ఆయన పుట్టిన తేదీ తెలీదు కానీ జూన్ నెలలో పుట్టినట్లుగా తెల్సు. అందుకే జూన్ నెలలో ఒక రోజు గ్రామంలోని వారందరినీ పిలిచి ఈ పుట్టిన రోజు కేవలం తన తండ్రిదే కాదని, అందరి తండ్రులందరిదీ అని తండ్రులు నిర్వహిస్తున్న పాత్రను మొత్తం సమాజం తెలుసుకొనే రోజని, పిల్లలకి విలువలు తెలిపే రోజని, దీన్ని 'ఫాదర్స్ డే' గా జరుపుకుందాం అని ప్రకటించింది సొనారా! పైగా మదర్స్‌డే వున్నపుడు ఫాదర్స్ డే కూడా ఎందుకు నిర్వహించరాదని సొనారా ప్రశ్నించింది. అంతా నవ్వుకున్న కూడా ఆమె 'ఆ ఫాదర్స్ డే' గుర్తింపు కోసం నిజాయితీగా తీవ్రంగా ప్రచారం ప్రయత్నించింది 1910 జూన్ 19వ తేదీన 'స్పోకన్'లో తొలి ఫాదర్స్‌డే జరుపుకున్నపుడు ఆమెకు తొలి విజయ సంకేతాలు కన్పించాయి. మినిస్టీరియల్ అసోసియేషన్ స్థానిక యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసిఎ)ల మద్దతుతో ఈ కార్యక్రమం జరిగింది.

అసలు మొదట జూన్ 5న మమతానురాగాలు అందించే తండ్రి పుట్టిన రోజును ఫాదర్స్‌డేగా నిర్వహించాలనుకున్న కూడా ఏర్పాట్లకి తగిన సమయం లేక జూన్ 3వ ఆదివారం నాడు నిర్వహించారు. అయితే 1916లో ఉడ్రోవిల్సన్ అధికారికంగా ఆమోదించాడు. 1966 జూన్ 3వ ఆదివారం ఫాదర్స్‌డే నిర్వహించాలని తీర్మానంపై అప్పటి అధ్యక్షుడు 'లిండన జన్సన్' సంతకాలు చేసాడు. 1972లో 'రిచర్డ్ నిక్సన్' (అప్పటి అధ్యక్షుడు) జూన్ 3వ ఆదివారం ఫాదర్స్‌డే నిర్వహించాలని శాశ్వత జాతీయ ప్రతిపత్తిని కల్పించారు. ఆనాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఫాదర్స్‌డే ప్రసిద్ధి పొందింది.

నేటి ఆధునిక ఫాదర్స్‌డే మాత్రమే కాక తండ్రులకి ప్రత్యేక రోజును కృతజ్ఞతా సూచకంగా కేటాయించి నట్లు అనేక వేల సంవత్సరాల క్రితం ఉందని చరిత్రకారులు అంటారు. బాబిలోన్ శిథిలాల్లో లభించినట్లు చేస్తారు ఫాదర్స్‌డే ఆనవాళ్లు!

ఎల్మేసు అనే పిల్లాడు నాలుగు వేల సం॥ క్రితం మట్టితో కార్డు తయారు చేసి దానిపై ఫాదర్స్ డే సందేశాన్ని చెక్కించినట్లు చరిత్రకారులు చెప్తారు. అందులో తన తండ్రి మంచి ఆరోగ్యంగా దీర్ఘకాలం జీవించాలని

ఎల్మేసు తండ్రికి ఏం జరిగిందన్నది అన్నట్లు: ఫాదర్స్‌డే ఉత్సవాలు మాత్రం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో జరుపుకునే ఆచారం వుంది.

### ఫాదర్స్ డే మూలం... సిద్ధాంతాలు...

1908 – తొలి ఫాదర్స్ డే, చర్చ్ సర్వీస్, వెస్ట్ వర్జీనియా (కొందరి ఉద్దేశం) ఇంకొందరు వాషింగ్టన్‌లో వాంకోడర్‌లో, తొలి ఫాదర్స్‌డే అంటారు

1915 – చికాగో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హ్యారీమీక్ జరిపాడంటారు.

మరికొందరు చరిత్రకారులు "ఫాదర్స్ డే ప్రారంభ ఘనతను వెస్ట్ వర్జీనియాకు చెందిన శ్రీమతి చార్లెస్ క్లేటన్‌ది అని అంటారు. పాశ్చాత్య దేశాల నుంచి దిగుమతి అయిన వేడుక ఇది. మన దేశంలో దీని వయస్సు శతాబ్ది కాలం లోపే.

డా॥ ఈడుపుగంటి పద్మజారాణి

#### బయటే కాదు ఇంటి పనులు కూడా...

ఒకప్పుడు తల్లి మాత్రమే పిల్లలతో చాలా చనువుగా ఉండేది. కానీ నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా తండ్రి కూడా పిల్లలను దగ్గరకు తీసుకొని వారితో చనువుగా ఉంటున్నాడు. పిల్లలను స్నేహితులుగా చూస్తున్న తండ్రులు కూడా నేడు ఉన్నాడు. ఇంటి పనులతో పాటు ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్న తల్లి మాదిరిగానే తండ్రి కూడా ఒకవైపు ఉద్యోగం చేస్తూ అవసరమైతే ఇంటి పనులను కూడా చేస్తున్నాడు.

–సరళ, విద్యార్థిని

#### అమ్మానాన్నంటే ప్రాణం...

మా నాన్నంటే నాకెంతో ఇష్టం. ఆయన నన్ను కంటికి రెప్పలా చూస్తాడు. పెద్దయిన తర్వాత కూడా చిన్నప్పటి ప్రేమ ఏమాత్రం తగ్గలేదు. నాతో కలిసి సినిమాలు, షికార్లకు కూడా వస్తాడు. నాన్న, నేను మంచి స్నేహితులుగా ఉంటాం. ఇక అమ్మ నన్ను ఎంతో గారాబం చేస్తుంది. అమ్మ, నాన్న ఇద్దరూ నాకు ప్రాణం.

– శ్రీకాంత్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

#### నాన్నవల్లే క్రమశిక్షణ...

చిన్నప్పటి నుంచి నాన్నకు నేనంటే ఎంతో ఇష్టం. అంతమాత్రాన నన్ను బాగా గారాబం చేయలేదు. నాకు ఎప్పుడూ ఎలా నడుచుకోవాలే చెబుతూ ఎంతో క్రమశిక్షణగా పెంచాడు. మంచి,చెడు గురించి చెప్పి సన్మార్గంలో పయనిస్తేనే సమాజంలో అందరి దృష్టిలో మంచివారిగా మిగిలిపోతామని చెబుతాడు. నాన్నవల్లే నాకు క్రమశిక్షణ అబ్బింది.

–రూపల్, విద్యార్థిని

#### తల్లితో సమానంగా తండ్రికి గౌరవం..

మాతృదేవో భవః...పితృదేవో భవః...అని అన్నారు మన పెద్దలు. తల్లితో పాటు తండ్రికి సైతం సమాన గౌరవం ఇవ్వాలి. తల్లి కని పెంచితే తండ్రి కంటికి రెప్పలా కాపాడతాడు. తన పిల్లకు అవసరమైన సదుపాయాలన్నింటినీ కల్పిస్తాడు. తల్లి ఇంట్లో ఉండి ఇంటి పనిచేసుకుంటూ పిల్లలను పోషిస్తే...తండ్రి ఉద్యోగం చేసి ఇంటికి, పిల్లలకు కావాల్సిన సౌకర్యాలను సమకూరుస్తాడు. తల్లిలాగా పిల్లలతో చనువుగా ఉండలేకపోయినా తండ్రి పిల్లలను దారిలో పెట్టేందుకు వారిని కోప్పడతాడు. క్రమశిక్షణతో మెలిగే విధంగా చూస్తాడు.

–సురేష్, ప్రైవేట్ ఉద్యోగి

# హజారేకు రజనీ అండ!



**సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టైలే వేరు. ఆయన ఏది చేసినా అభిమానులకు అది గొప్ప వార్త అవుతుంది. ఇతర హీరోల మాదిరిగా కాకుండా ప్రజల కోసం ఏదైనా చేయాలని తపిస్తుంటారు. ఈ తపనే ఆయన్ని మాస్ హీరోను చేసింది. ఈ నేపథ్యంలో రజనీకాంత్ అవినీతి నిరోధానికి పోరాడుతున్న అన్నా హజారే పక్షాన నిలవాలని భావిస్తున్నారు. జన్ లోక్‌పాల్ బిల్లుతో ప్రజలకు మేలు జరుగుతుందని రజనీ పేర్కొంటున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స చేయించుకొని ఈనెల 15న సింగపూర్‌లోని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు ఆయన.**



దక్షిణాది సూపర్‌స్టార్ రజనీకాంత్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ కొంత కాలం సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. చివరికి ఆయన ఈ వ్యాధి నుంచి పూర్తిగా కోలుకొని ఈనెల 15న సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ విషయాన్ని ఆయన అల్లుడు ధనుష్ ప్రకటించారు. దీంతో పాటు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లో రజనీకాంత్ ఆరోగ్యం మెరుగుపడిందనీ...ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్చి అయ్యారని ధనుష్ వెల్లడించారు. కానీ రజనీకాంత్ మరో 45 రోజుల వరకు సింగపూర్‌లోనే ఉంటున్నారు. అక్కడే ఇన్‌ఫెక్షన్–ఫ్రీ జోన్‌లో ఆయన కొంతకాలం ఉండి పూర్తి ఆరోగ్యంతో తిరిగి దేశానికి రానున్నారని సమాచారం.

పూర్తిగా కోలుకున్న రజనీకాంత్ అన్నా హజారే అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యమం గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ప్రజల కోసం జన్‌లోక్‌పాల్ బిల్లును తీసుకురావాలని ఉద్యమిస్తున్న హజారే తీరును చూసి ఎంతో ప్రభావితులయ్యారు. అందరి హీరోల మాదిరిగా చూస్తూ ఊరుకోకుండా హజారే ఉద్యమానికి మద్దతునివ్వాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. మానవతావాదిగా పేరొందిన రజనీకాంత్ ప్రతిసారి తన ఉదారతను చాటుకున్నారు. ప్రజల కోసం ఉద్యమిస్తున్న అన్నాహజారేకు పూర్తి మద్దతివ్వాలని ఆయన భావించారు. సింగపూర్‌లో కోలుకుంటున్న రజనీ ఎప్పటికప్పుడు హజారే ఉద్యమం గురించి తెలుసుకుంటూనే ఉన్నారు. జన్‌లోక్‌పాల్ బిల్లుతో దేశవాసులకు ఎంతో మేలు జరుగుతుందని ఈ బిల్లును సాధించేందుకు పోరాటం చేస్తున్న హజారే యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని రజనీకాంత్ అన్నట్టు సమాచారం. రజనీకాంత్ ప్రస్తుతం అన్నా హజారేకు అభిమానిగా మారడం విశేషం. అన్నా ఉద్యమానికి మద్దతు పలకడం మూలంగా దేశవాసులకు తనవంతు సహాయం చేయాలని రజనీకాంత్ భావిస్తున్నారు. ఇక రజనీకాంత్ బహిరంగంగా అన్నాహజారేకు మద్దతు ప్రకటిస్తే అది యువతపై పెద్ద ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. దక్షిణాది సూపర్‌స్టార్‌పై యూత్‌లో ఉన్న క్రేజ్ మూలంగా వీరంతా అన్నా హజారే ఉద్యమంలో పాల్గొనవచ్చు.

# ఉత్సాహంగా స్టెప్పులు వేసి





ఉత్సాహం ఉరకలెత్తగా... సంతోషం పరవళ్లు తొక్కగా పార్టీలవర్స్ నైట్ అవుట్‌లో హాయిగా సేదతీరారు. జోరుగా...హుషారుగా సాగిన వీకెండ్ నైట్ పార్టీ యువ జంటలకు మరచిపోలేని అనుభూతులను మిగిల్చింది. హైదరాబాద్‌లోని బాటిల్స్ అండ్ చిమ్నీస్, లిక్విడ్స్ పబ్‌లలో జరిగిన వారాంతపు జల్సాలు కుర్రకారును ఆనందోత్సాహాల్లో ముంచెత్తాయి. ఫాస్ట్‌బీట్ మ్యూజిక్ హోరులో యువ జంటలు డ్యాన్సు ఫ్లోర్‌పై ఉత్సాహంగా స్టెప్పులు వేసి అదరగొట్టారు. మధురమైన కాక్‌టైల్స్‌ను ఆస్వాదిస్తూ తమదైన లోకంలో పార్టీ లవర్స్ విహరించారు. గంటలను క్షణాలుగా గడిపి మధురానుభూతులను పొందారు.